


ఆ వ్యక్తిని చూసి కండక్టర్, డ్రైవర్ ఆశ్చర్యపోయారు.

ఆ రోజు భార్గవిని బస్‌లో నుంచి తీసుకువెళ్ళిపోయినది వాడే నన్నట్టుగా జయంత్ వైపు చూశారు.

జయంత్ ముఖం ఎర్రగా వుంది.

కళ్ళు అరుణిమ దాల్చాయి!!

"రామనాథంగారూ వీడేనండీ— మీ అమ్మాయిని హత్య చేసింది!"

శేఖరానికి 'మిస్టరీ' అర్థం కావడంలేదు.

"ఆ రోజు మీరు విజయనగరం ట్రంకాల్ మాట్లాడినప్పుడు ఆ బోర్డ్ మీద కూర్చున్నది ఈయనే! అసిస్టెంట్ ఇంజనీర్ గారిని ఎంక్వయిరీ చేసి తీసుకువచ్చాను."

అప్పుడుజ్ఞప్తికొచ్చింది శేఖరానికి—"త్రీ మినిట్స్ ఓవర్" అంటూ లైన్ మధ్యలోనికొచ్చిన ఆపరేటర్!!

శేఖరం కళ్ళు నిశ్శబ్దంగా వర్షిస్తున్నాయ్!

రామనాథంగారు భార్గవిని గుర్తు చేసుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్నారు.

కృష్ణవేణి, సత్యమూర్తుల కళ్ళల్లో నీళ్ళు స్రవిస్తున్నాయి.

"అదిగో అటు చూడండి!" జయంత్ మాట విని అంతా అటువైపు చూశారు.

ఎక్స్చేంజ్ గోడమీద ఎర్రటి బోర్డు— దానిమీద తెల్లటి అక్షరాలు.

"A.T O. is a P. R. O."

"—అంటే ఏ టెలిఫోన్ ఆపరేటర్ ఈజే పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ - కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరించిన ఈ వెధవని ముక్కలు ముక్కలుగా నరికి పోగులు పెట్టాలి...." జయంత్ కంఠంలో కరకుదనం కన్పిస్తుంది!

ఆ టెలిఫోన్ ఆపరేటర్ చేతులకి సంకెళ్ళుబిగుసుకున్నాయి.

జయంత్ జీపను స్టార్ట్ చేశాడు.

## మినీకథ

### శ్రీవారితో షాపింగ్

అప్పుడే వచ్చిన పూరీ ఎక్స్‌ప్రెస్‌లోంచి సుబ్బారావు తన పటాలంతో దిగేడు. తనతో తెచ్చిన సామానులు పదీ, తనతో వచ్చిన మనుష్యులు ఎనిమిదీ ఉన్నాయో లేదో లెఖ్ఖ చూసుకుని "ఆ! నడవండి" అని అందరికీ తలో లగేజీ ఇచ్చి తనో రెండు సూట్‌కేసులు చేత్తో పుచ్చుకుని స్టేషన్ బయటకి వచ్చేడు.

సుబ్బారావుకి రెండురోజుల క్రితమే పెండ్లి అయింది. పసుపు బట్టలతో కొండకి వస్తాం అని మొక్కుకున్న కారణంగా తల్లి, ఇద్దరు చెల్లెళ్ళూ, తమ్ముడూ, భార్యా, మరదలూ, అత్తగార్లతో తిరుపతికి వచ్చేడు. అక్కడందరిలోకీ పెద్ద మగ దిక్కు తనే కనుక అందులో తన భార్య తనని హీరోగా అనుకోవాలని కొంచెం ఎక్కువగానే హడావిడి చెయ్యసాగేడు.

స్టేషన్ బయటకి వచ్చి "ఇదిగో! అసలే ఇక్కడ అంతా మోసం. మీరు మీ చేతుల్లో సామాన్లు వదిలి దిక్కులు చూడద్దు. అంతా నేను చూపిస్తాను. కానీ, మీరు జాగ్రత్త" అని అందరికీ చెప్పి తన భార్యకేసి చూసి కాలరెగరేసి—

"అబ్బా! అప్పుడే ఎంత ఎండగా వుందో కదా. కాఫీ ఏమైనా కావాలా" అని అడిగేడు.

రాత్రంతా ప్రయాణంవల్ల అలసటగా చెదిరిన జుట్టుతో వున్న రాజేశ్వరి సిగ్గుగా వద్దు అన్నట్లు తల అడ్డంగా వూపింది.



"సర్లెండి ముందు కొండకిపోయి ఆ తరువాత చూద్దాం అన్నీ" అంటూ కొద్దిదూరం వెళ్ళారు. యాపిల్ పండ్ల బండి ఒకటి కనబడింది. వాటి దగ్గరకి వెళ్ళి "ఎంత బాబూ యాపిల్స్ పళ్ళు" అని అడిగేడు.

"ఎండు ముక్కాలు రూపాయి" అన్నాడు పళ్ళవాడు.

కాసేపు అటూ ఇటూ తిరిగేసి "సరిగ్గా ఇచ్చే ధర చెప్పు" అన్నాడు సుబ్బారావు.

"జతొక టింకాలు ఇవ్వండి."

నర్సీపట్నం నుంచి వచ్చిన సుబ్బారావుకి అర్థం కాలేదు. కానీ అలా తెలిస్తే మోసం చేస్తారని "ఒక కాలూ లేదు. రెండు కాళ్ళూ లేవు. పండు రూపాయి చేసి ఓ పది పళ్ళు ఇయ్యి" అని పండ్లు తీసుకొని వెళ్ళిపోయాడు.

ఆ పండ్ల బండివాడు సుబ్బారావు చేతిలో పెట్టిన పది రూపాయలూ చూసుకుంటూ సంతోషంతో మాట రాక సుబ్బారావు పోయిన దిక్కు చూస్తూ నిలబడిపోయాడు.

కానీ అక్కడ ముక్కాలు రూపాయి అంటే ముప్పావలా అనీ, ఒక టింకాలు అంటే రూపాయి పావలా అని తెలియని సుబ్బారావు మాత్రం "చూశావా" అన్నట్లు భార్యకేసి ఓ చూపు చూసి ధీమాగా ముందుకి నడిచాడు.

—యమ్. లక్ష్మి